నిరుపేదల గళం చెన్నమనేని

● అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్



'శాసనసభలో మూడు దశాబ్దాల ప్రజావాణి' పుస్తకాలతో స్పీకర్ ప్రసాద్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు

వేములవాడ, మార్చి 3: నిరుపేదల గళం, చట్టసభల ద్వారా సమస్యలకు పరిష్కారాన్ని చూపిన అరుదైన అపార అనుభవం ఉన్న నేత చెన్నమనేని రాజేశ్వర్‌రావు అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కొనియాడారు. రాజేశ్వర్ రావు శత జయంతి సందర్భంగా చెన్నమనేని రాజేశ్వర్‌రావు లలితాదేవి ఫౌండేషన్ ద్వారా విడుదలైన 'శాసనసభలో మూడు దశాబ్దాల ప్రజావాణి' పుస్తకాలను మాజీ ఎమ్మెల్యే రమేశ్ బాబు సోమవారం ఆయనకు అందజేశారు. అసెంబ్లీలో త్వరలో జరుగబోయే బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలకు అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, సుదీర్ఘ అనుభవం ఉన్న చెన్నమనేని రాజేశ్వర్‌రావు ప్రసంగాలు ప్రస్తుత నూతనతరం శాసనసభ్యులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పార్టీల మధ్య సిద్ధాంత వైరుధ్యాలు ఉన్నప్పటికీ పార్టీ నేతలను గౌరవించే అరుదైన నేతగా చిన్నమనేని గుర్తింపు తెచ్చుకున్నారని స్పీకర్ కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు, చెన్నమనేని వెంకటేశ్వర్‌రావు, చెన్నమనేని శ్రీ కుమార్, మరియా, సంగీత ఉన్నారు.

ఆపదలో సాయం చేసేవారే నిజమైన మిత్రులు

● మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు

రక్త దానం చేస్తున్న శరత్‌రావు

ముస్తాబాద్, ఫిబ్రవరి 3: సాటి మనిషి ఆపదలో ఉన్నప్పుడు తోడుగా నిలబడి ధైర్యాన్నిచ్చేవారే నిజమైన మిత్రులు అని మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు పేర్కొన్నారు. మద్దికుంటలో రాజనర్సయ్య అనే వ్యక్తి వారం రోజుల క్రితం మధ్యప్రదేశ్‌లో ప్రమాదానికి గురికాగా, అతనిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. రాజనర్సయ్యను పరామర్శించేందుకు శరత్‌రావు దవాఖానకు వెళ్లారు. అప్పుడే డాక్టర్లు రక్తం కావాలని తెలుపగా శరత్‌రావు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారికి మనోధైర్యానిచ్చి అవసరమైన వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని పిలుపునిచ్చారు.

కంచర్ల శివారు అడవిలో అగ్గి

వీర్నపల్లి, మార్చి 3: అడవుల రక్షణకు అటవీ శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నా అగ్గి రాజుకుంటూనే ఉన్నది. అగ్ని ప్రమాదాలకు అటవీ సంపద కాలిపోతూనే ఉన్నది. ఇటు వంటి సమయాల్లో వన్య ప్రాణులకు ముప్పు ఏర్పడుతున్నది. తాజాగా వీర్నపల్లి మండలంలోని కంచర్ల శివారులోని అటవీ ప్రాంతంలో మంటలు వ్యాపించగా, సుమారు మూడు గంటల పాటు అటవీ సిబ్బంది శ్రమించి ఆర్పివేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★Reddaveni Pravalika W/o Reddaveni Sudheer Kumar, (Old Name), H.No. 12-7-117/1, Shiva Nagar, Sircilla Town & Mandal, Rajanna Sircilla Dist. My Name changing as per my Certificates, Garige Pravalika W/o Reddaveni Sudheer Kumar (New Name)
NTK-00000

CHANGE OF NAME

★Kairamkonda Rekha, W/o Kairamkonda (Old Name) Srikanth D/o Myaka Pochaiah, H.No. 7-60/6, Vill & Mdl: Thangallapally, Rajanna Sircilla Dist. My Name was changed to Myaka Neeraja (New Name)
NTK-00000

LOST

నేను మోర సత్యంబాబు @ మోర సత్యనారాయణ, తండ్రి: హనుమయ్య, నివాసం: గోదావరిఖని, మా ఇంటి నుంచి బైక్ మీద బస్టాండ్ (గోదావరిఖని) వెళ్తుండగా తేదీ: 06-02-2025 రోజున నా ఒరిజినల్ భూమి డాక్యుమెంట్ (కోహెడ గండి చెరువు వద్ద సర్వే నెం. 196 లోని 200 చ.గల. భూమి ప్లాట్ నెం. 299, డాక్యుమెంట్ నెం: 333/2000) పోయినది. దొరికిన వారు సంప్రదించగలరు: 7997662022.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

ప్రజావాణికి సమస్యల వెల్లువ

● 108 దరఖాస్తుల రాక
● సత్వరం పరిష్కారం చూపాలి: కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, మార్చి 3: ప్రజావాణికి సమస్యలు వెల్లువెత్తాయి. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి 108 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఇందులో రెవెన్యూ శాఖకు 45, మున్సిపల్ సిరిసిల్ల 14, జిల్లా సంక్షేమ శాఖ, ఉపాధి కల్పన శాఖ, ఎస్‌డీసీకి ఆరు చొప్పున, విద్యా శాఖకు 5, ఎస్పీ ఆఫీస్‌కు 4, నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖ, ఎంపీడీవో తంగళ్లపల్లికి మూడు చొప్పున, డీఆర్‌డీఓ, రిజిస్ట్రార్, సెస్‌కు రెండు చొప్పున, సర్వేశాఖ, ఆర్ అండ్‌బీ, జిల్లా పౌరసరఫరాల శాఖ, సీపీవో, డీపీవో, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్, ఎస్సీ కార్పొరేషన్‌కు ఒకటి చొప్పున వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శేషాద్రి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం కాలనీలో వసతులు కల్పించాలి

సిరిసిల్ల పట్టణం ఒకటో వార్డులోని రగుడు డబుల్ బెడ్రూం ఇండ్ల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీవాసులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కోరారు. ప్రభుత్వం జీ ప్లస్-2 పద్ధతిలో 72 ఇండ్లు నిర్మించి ఇచ్చిందని, అయితే చుట్టుపక్కల వ్యవసాయ పొలాలు ఉండడంతో పాములు, తేళ్లు నిత్యం వస్తున్నాయని వాపోయారు. అలాగే డబుల్ బెడ్రూం ఇండ్లకు సంబంధించిన భూమిని కొందరు ఆక్రమించుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీసీ రోడ్లు, వీధి దీపాలు, సీసీ కెమెరాలు, ఓపెన్ జిమ్, ప్రహరీ నిర్మించాలని కోరారు. అలాగే మిషన్ భగీరథ నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బోరు వేయించి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఇక్కడ కాలనీవాసులు ఆర్ సునీత, ఎన్ రేణుక, పీ కవిత, కే నవ్య, బీ భవిత, కే సువర్ణ, అంజమ్మ, పద్మ, అంజలి ఉన్నారు.

కొడుకులు పోషించడం లేదు

తన కొడుకులు పోషించడం లేదని చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికి చెందిన గసికంటి నర్సవ్వ అనే వృద్ధురాలు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. తనకు 75 ఏండ్లు ఉంటాయని, భర్త చాలా రోజుల కిందే కాలం చేశాడని చెప్పింది. ముగ్గురు కొడుకులు తన వద్ద ఉన్న డబ్బులు లాక్కొని ఇంట్లో నుంచి వెల్లగొట్టి ఇబ్బందులు పెడుతున్నారని, గూడు లేక రోడ్లమీదే బతుకుతున్నానని వాపోయింది.

సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలి..

తన పేరిట ఉన్న భూమిని సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్ ఇతరులకు రిజిస్టర్ చేశారని సిరిసిల్ల శాంతినగర్‌కు చెందిన బూర నారాయణ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. 2006లో శాంతినగర్ శివారులో సర్వే నంబర్ 67లో ప్లాట్ నంబర్ 75 కొనుగోలు చేసి రిజిస్ట్రేసన్ చేసుకుని ఎల్ఆర్ఎస్ అనుమతి కూడా పొందిఉన్నానని తెలిపాడు. సదరు ప్లాటును తాను ఎవరి పేరిట విక్రయించకున్నా, ఇతరులపై పేరుపై సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరాడు. అలాగే ఇదే సర్వేనంబర్‌లో 76 నంబర్ గల తన ప్లాట్‌ను ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల శాంతినగర్‌కు చెందిన వేముల రమేశ్ సైతం ఫిర్యాదు చేశాడు.

దివ్యాంగుల పెన్షన్ ఇప్పించాలి

మతిస్థిమితం లేని తన కుమార్తె అనన్యకు దివ్యాంగుల పెన్షన్ ఇప్పించాలని ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన కాసారపు చంద్రం కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశాడు. అనన్యకు చిన్నప్పటి నుంచి మతిస్థిమితం లేక మెదడులోని నరాలు అన్ని దెబ్బతిని అచేతన స్థితిలో ఉందని తెలిపాడు. చాలా దవాఖానల్లో తిరిగినా ఫలితం లేదని, తనది నిరుపేద కుటుంబమని, నా పాపకు పెన్షన్ మంజూరు చేయించాలని వేడుకున్నాడు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు

అధికారులు అందించిన ట్రై సైకిల్‌తో లేదెల్ల రమేశ్

ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన దాసరి పవన్ అనే బాలుడు పుట్టుకతోనే నడవలేని స్థితిలో ఉన్నాడు. సోమవారం ప్రజావాణికి వచ్చి తనకు వీల్ చైర్ ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించాడు. అలాగే వేములవాడలోని సాయినగర్‌కు చెందిన లేదేళ్ల రమేశ్ సైతం తనకు మ్యానువల్ ట్రై సైకిల్ ఇప్పించాలని కోరాడు. వెంటనే కలెక్టర్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు దాసరి పవన్‌కు వీల్ చైర్, లేదేళ్ల రమేశ్‌కు మ్యానువల్ ట్రై సైకిల్, సంక కర్ర (axilla crutches)ను జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం అందజేశారు.

దివ్యాంగులకు యూడీఐడీ జారీ చేయాలి

కలెక్టరేట్, మార్చి 3: ప్రతి దివ్యాంగుడికి యూడీఐడీ జారీకి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో యూనిక్ డిసేబులిటీ ఐడీ జారీ(యూడీఐడీ)పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ బదులు యూనిక్ డిసేబులిటీ ఐడీ ఇవ్వాలని స్పష్టం చేశారు. దృష్టి, వినికిడి లోపం, అంగవైకల్యం, మానసిక వైకల్యం ఉన్న వారికి వైకల్య శాతాన్ని పరిశీలించి (యూడీఐడీ) కార్డులు జారీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కొత్తగా కార్డుల కోసం మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, సదరం సర్టిఫికెట్ ఉన్న వారికి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి ద్వారా యూడీఐడీ జనరేట్ చేస్తారని వివరించారు. ఇక్కడ డీఆర్డీవో శేషాద్రి, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సిరిసిల్ల సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, వేములవాడ దవాఖాన సూపరింటెండెంట్ పెంచలయ్య పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్‌పై అవగాహన కల్పించండి

వేములవాడ, మార్చి 3: లేఅవుట్ రెగ్యులేషన్ స్కీం కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న వెసులుబాటుపై అవగాహన కల్పించాలని వేములవాడ పురపాలక సంఘం టీపీఎస్ అభినవ్ సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన ఉద్యోగులతో మాట్లాడుతూ మొత్తం వేములవాడ పురపాలక సంఘం పరిధిలో 16వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో ఇప్పటికే రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖ సంయుక్తంగా పరిశీలించిన 11వేల దరఖాస్తులు ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి ఉద్యోగికి 600 దరఖాస్తులను కేటాయిస్తామని, వాటిపై అర్జీదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. అందుబాటులో ఉన్న మీసేవ, ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా చెల్లింపుల వివరాలు తెలుసుకోవచ్చునని చెప్పారు.

'మధ్యాహ్న' కార్మికులంటే చిన్నచూపు

కోనరావుపేట, మార్చి 3: కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులను చిన్నచూపు చూస్తున్నదని, అధికారంలోకి వచ్చి 14 నెలలవుతున్నా వారి సమస్యలపై పట్టనట్లు వ్యవహరిస్తున్నదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి మండిపడ్డారు. మరిమడ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో వంట చేసే కార్మికురాలు బొజ్జ సత్తవ్వ ఇటీవల గుడెపోటుతో మృతిచెందగా, తోటి కార్మికులతో కలిసి ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. కార్మికులకు ఎనిమిది నెలల నుంచి మెస్, కోడిగుడ్ల బిల్లులు, గౌరవవేతనం రావడం లేదన్నారు. అప్పులు చేసి మధ్యాహ్న భోజనం వండాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. కార్మికుల న్యాయ డిమాండ్లను నెరవేర్చాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు నెలకు రూ.10వేలు గౌరవవేతనం అందించాలని కోరారు. ఇక్కడ కవిత, వసంత, సత్తవ్వ, రాధ, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడ్డ మహిళ .. కాపాడిన ఫైర్ సిబ్బంది

వేములవాడ రూరల్, మార్చి 3: ప్రమాదవశాత్తూ బావిలో పడ్డ మహిళను ఫైర్ సిబ్బంది, ప్రజలు కాపాడిన ఘటన వేములవాడ పట్టణంలోని అయ్యేరుపల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నేదూరి భారతి సోమవారం గ్రామ శివారులోని తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. ప్రమాదవశాత్తూ బావిలో పడిపోయింది. కుటుంబసభ్యులు గమనించారు. అగ్నిమాపశాఖకు సమాచారం ఇచ్చారు. క్రేన్‌ను తెప్పించారు. అగ్నిమాపక ఎస్ఎఫ్ఓ అనిల్‌కుమార్, గ్రామస్తులు ఏదుల గోపి, రాజు, ఫైర్ సిబ్బంది తీవ్రంగా కృషిచేసి, ఆమెను బయటకు తీశారు. కాగా, భారతి రెండు కాళ్లు విరిగిపోగా, దవాఖానకు తరలించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో మేధాశక్తి

వేములవాడ టౌన్, మార్చి 3: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మకత, మేధాశక్తి పెరుగుతుందని వేములవాడ ఎంఈవో భూక్యా బన్నాజీ పేర్కొన్నారు. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు 150 ఎగ్జిబిట్లను ప్రదర్శించగా, కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రొగ్రాంను విజయవంతం చేసిన సైన్స్ ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఇక్కడ ఉపాధ్యాయులు కృష్ణ, బాలరాజు, రాధిక, అరుంధతి, హరికృష్ణ, యాదగిరి, సత్యనారాయణ, మాధవి, సరళ, సరిత, స్వాతి, రవీందర్‌రావు, సవిత, సీఆర్‌పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోనరావుపేట ఎంపీపీఎస్‌లో

కోనరావుపేట, మార్చి 3: మండల కేంద్రంలోని పీఎంశ్రీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాలైన ఎగ్జిబిట్లను ప్రదర్శించగా, ఎంఈవో మురళీనాయక్ పరిశీలించారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయులు రాజేశం, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ కరెడ్ల రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ముఠా అరెస్ట్

● ఆన్‌లైన్ సెంటర్లే లక్ష్యంగా మోసాలు
● నలుగురు అదుపులోకి..
● వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, మార్చి 3: ఆన్‌లైన్ సెంటర్లే లక్ష్యంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసి నలుగురుని అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అరెస్టు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని భీమండికి చెందిన దాసరి మురళి అక్కడే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. అయితే విలాసవంత జీవితానికి అలవాటు పడి ఈజీ మనీ లక్ష్యంగా తన స్నేహితులు విలేష్, రమేశ్, జింతేంద్రసోమాభాయ్, నిలేష్ జై సింగ్‌తో ముఠాగా ఏర్పడ్డాడు. రోజూవారీగా ఆన్‌లైన్‌లో లావాదేవీలు ఎక్కువగా ఉంటాయని, తన మనుషులు వచ్చి డబ్బులు ఇస్తారని మనీ ట్రాన్స్‌ఫర్ చేయాలని ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులను నమ్మబలికి మోసం చేస్తుండేవాడు. ఇలాగే కొన్ని రోజుల క్రితం వేములవాడ పరిధిలోని అగ్రహారంలో ఆన్‌లైన్ సెంటర్ నిర్వహిస్తున్న చీర్లవంచ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన ఇనుకొండ మహేశ్‌కు నిందితుడు దాసరి మురళి ఫోన్ చేసి తాను సివిల్ ఆసుపత్రిలో పని చేస్తున్న డాక్టర్ రాజిరెడ్డిగా పరిచయం చేసుకున్నాడు. తాను ఓ వ్యక్తితో నగదు పంపిస్తానని, కమీషన్ తీసుకొని తన అకౌంట్‌కి మనీ ట్రాన్స్‌ఫర్ చేయాలని అడుగడంతో మహేశ్ ఒప్పుకున్నాడు. ఇదే టైంలో సిరిసిల్లలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడికి ఫోన్ చేసి తాను డిగ్రీ కాలేజీ లెక్చరర్‌ను అని, 110 బిర్యానీలు కావాలని, అడ్వాన్స్ కోసం అగ్రహారంలోని మహేశ్ ఆన్‌లైన్ సెంటర్‌కు వెళ్లాల్సిందిగా సూచించాడు. ఇలా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు అక్కడికి వెళ్లి మురళికి ఫోన్ చేయడం, అతను మహేశ్‌కు ఫోన్ చేసి 'తన మనిషి వచ్చాడు. తాను అడిగిన రూ.65వేలు ట్రాన్స్‌ఫర్ చేయాలని' సూచించడంతో మహేశ్ సెండ్ చేశాడు. ఆ తర్వాత ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకుడిని మహేశ్ డబ్బులు అడుగడం, దీంతో అతను 'నేనెందుకు ఇస్తా..? బిర్యానీల బుకింగ్ అడ్వాన్స్ కోసం వచ్చానని చెప్పడంతో కంగుతిన్నాడు. అనంతరం ఇద్దరూ మోసపోయామని గుర్తించి వేములవాడ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సీఐ వీర ప్రసాద్ ఆధ్వర్యంలో బృందం రంగంలోకి దిగింది. సాంకేతికత ఆధారంగా భీవండిలో ఉన్నట్లుగా గుర్తించి, నలుగురు నిందితులను అరెస్టు చేశామని ప్రధాన నిందితుడైన మురళి పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. కాగా, ఈ ముఠాపై దేశ వ్యాప్తంగా 54 ఫిర్యాదులు వచ్చాయని, రూ.30లక్షల మేర మోసానికి పాల్పడ్డారన్నారు. అయితే ఈ మోసాల వెనుక గుజరాత్‌కు చెందిన కీలక వ్యక్తి ఉన్నట్లు తెలిసిందని, అతడిని కూడా పట్టుకునేందుకు స్పెషల్ టీంను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇక్కడ సీఐ వీర ప్రసాద్, స్పెషల్ టీం జునైద్, గంగిరెడ్డి, మహేశ్ ఉన్నారు.

గ్రీవెన్స్ డేలో 16 ఫిర్యాదులు

బాధితుల సమస్యల సత్వర పరిష్కారానికి జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డేకు 16 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని, ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.

నీళ్లెక్కడ వచ్చిన యో కాంగ్రెస్ నేతలు చెప్పాలి

● ఎండిన పంటలు కాపాడాలని రైతులు కోరితే హేళనగా మాట్లాడుతరా..?
● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్

కాలువలో నిరసన తెలుపుతున్న రైతులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 3: మానేరు కెనాల్ పారకం కింద నీళ్లు ఎక్కడ వస్తున్నాయో..? కాంగ్రెస్ నాయకులు చెప్పాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ ప్రశ్నించారు. సోమవారం ముస్తాబాద్ మండల కేంద్రంలోని మానేరు కెనాల్ పారకం, 19, 20, 20/1 నెంబర్ డిస్ట్రిబ్యూటరీల దగ్గర మానేరు రైతులతో కలిసి అడుగంటిన కెనాల్‌లో దిగి, సమీపంలో ఎండిన పొలంలో కూర్చొని నిరసన తెలిపారు. మానేరు ఆయకట్టు కింద వేసిన పంట పొలాలకు ప్రాజెక్టు కెనాల్ ద్వారా నీరు రావడంలేదని, విడుదల చేయాలని రైతులు రెండు రోజుల క్రితం ఎమ్మార్వో ఆఫీస్‌కు వెళ్లి విన్నవిస్తే, కాంగ్రెస్ మండల నాయకులు అవహేళనగా మాట్లాడారన్నారు. రైతులు ఎవరూ లేని టైంలో పచ్చని పొలాల దగ్గర ఫొటోలు దిగి, సాగు నీళ్లు పుష్కలంగా వస్తున్నాయని ప్రచారం చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ నాయకులకు ఎండుతున్న పొలాలు, తడారిన కాలువలు కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కండ్లు తెరవాలని, మానేరు కాలువ ద్వారా సాగు నీరందించి పంటలను కాపాడాలని, లేదంటే రైతుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మిడిదొడ్డి బాలరాజు, చెవుల బాలెల్లు, సుంచు దేవయ్య, ఎడ్ల రాజు, జంగం శంకరయ్య, సుంచు రాజు, చింతల ఎల్లయ్య, చింతల రాజు, పెద్దులు, ఎల్లయ్య, లోకం శీను, పర్శ రాములు, బండారి శ్రీను, సాకలి చంద్రం, చంద్రయ్య, ఎల్లం, ఎడ్ల రాజయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రసమయి పరామర్శ

ఇల్లంతకుంట రూరల్,మార్చి3: అనంతగిరి పోచమ్మ ఆలయ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వల్లంపట్ల రాజారాం తల్లి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం రాజారాంను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. ఆయన వెంట జడ్పీ మాజీ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, తడుకపెల్లి భూమయ్య, మహిపాల్‌రెడ్డి, పర్శరాం, బాలకిషన్, దేవేందర్‌యాదవ్, బాలాగౌడ్, సురేందర్ రెడ్డి, శేఖర్, బాబు, పోచమల్లు, మోహన్,బలరాం ఉన్నారు.

భర్త, అత్తపై అదనపు కట్నం కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 3: అదనపు కట్నం కోసం భార్యను హింస పెట్టినందుకు భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేటకు చెందిన దున్నపోతుల లావణ్యకు ముస్తాబాద్‌కు చెందిన రాజుతో రెండేండ్ల క్రితం రూ.4లక్షల నగదుతోపాటు బంగారు ఆభరణాలిచ్చి వివాహం జరిపించారు. అత్తింటివారు మొదట బాగానే చూసుకున్నప్పటికీ కొన్ని రోజులుగా భర్త రాజు, అత్త కనకవ్వ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. లావణ్య ఫిర్యాదు మేరకు భర్త, అత్తలపై కేసు నమోదు చేశారు.

రాజన్నపేటలో నలుగురిపై

అదనపు కట్నం తేవాలని వేధిస్తున్న అత్తింటికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. రాజన్నపేటకు చెందిన ఎర్రోల్ల రేఖను 16 ఏండ్ల క్రితం కొత్తపల్లికి చెందిన రమేశ్‌తో రూ.5లక్షల నగదు, 9తులాల బంగారం కట్నంగా ఇచ్చి వివాహం జరిపించారు. కొన్ని రోజులుగా మరో రూ.5లక్షలు అదనపు కట్నం తేవాలని భర్త రమేశ్, ఆడపడుచులు నేతరి కిట్టవ్వ, ఆరెల్లి శాంతవ్వ, నరసవ్వ వేధిస్తున్నట్లు రేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఉన్నత వ్యక్తిత్వమే ఎదుగుదలకు ఇంధనం

వేములవాడ రూరల్, మార్చి 3: మనిషి ఉన్నత వ్యక్తిత్వమే ఎదుగుదలకు ఇందనంగా పనిచేస్తుందని రిటైర్డ్ ప్రిన్సిపాల్, కవి, రచయిత బుర్ర మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చీర్లవంచ జడ్పీహెచ్ ఉన్నత పాఠశాలలో శాతవాహన, లయన్స్‌క్లబ్ సహకారంతో పరీక్షల పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరై, మాట్లాడారు. అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి మన సద్గుణాలే ఉపయోగపడుతాయన్నారు. రానున్న పరీక్షల్లో సత్తాచాటి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఇక్కడ హెచ్ఎం మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం

ముస్తాబాద్, ఫిబ్రవరి 3: మండలంలోని వినియోగదారుల శ్రేయస్సు కోసమే విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నామని, సమస్యలను పరిష్కరిస్తామని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద